**కథ**

**అందనంత ఎత్తులో ఉంటాయి కనుకనే, మబ్బులూ జాబిల్లీ అంత అందంగా కనిపిస్తాయి. మనసులూ, మనుషులూ కూడా అంతే! దూరంగా ఉన్నప్పుడే, చేజారిన తర్వాతే అవి అపురూపంగా కనిపిస్తాయి. ప్రస్తుతం పునీతని చూస్తుంటే సాందీప్‌కి కూడా అలాగే అనిపిస్తోంది. ఎలాగోలా ఆ అందాన్ని అప్పటికప్పుడే అనుభవించి తీరాలన్నంత ఆవేశం పుడుతోంది.**

# గడచిన వసంతం

ఆమాటకొస్తే ఐదేళ్ళ క్రితం, పునీత చాలా సన్నగా రివటలా ఉండేది. పైగా ఎప్పుడూ వెనువెంటే తిరిగేది కూడా! ఆ కారణంగానే ఆమె 'అందం' అతనికి ఆసక్తిని కలిగించలేదు. కానీ ఇప్పుడలా కాదు. పెళ్ళయి, ఓ బిడ్డకి తల్లయిన పునీత, కాస్త ఒళ్ళు చేసి, నిండుగా, నునుపుగా కనిపిస్తోంది. అదుగో..ఆమె రూపే అతని కళ్ళు చెదరగొడుతోంది.

అసలు ఆనాడే తనామెని అనాఘ్రాణిత పుష్పంలా రుచి చూడకుండా వదిలేయడం చాలా తెలివితక్కువతనం అనిపిస్తోందతనికి. ఆ లోటుని ఈ క్షణంలోనే... ఇప్పుడే భర్తీ చేసుకోవాలన్న కోరిక అనుక్షణం అతని మనసుని తొలిచేస్తోంది. అందుకే, ఆమెనలా చూస్తూ ఊరుకోలేకా, అలాగని రంగంలోకి దిగలేకా సతమతమైపోతున్నాడతను. ఆ హడావిడిలోనే ఆమె అందాల్ని చూస్తూ గబగబా రెండు గుటకలు మింగాడు.

చూస్తున్న పునీతకి ఇబ్బందిగా అనిపించింది. అటుపైన దాదాపు అరగంట నుంచీ అతనలా మాటా మంతీ లేకుండా తననలా 'తినేసేలా' చూడ్డం.. ఆమెకి అస్సలు నచ్చలేదు. కానీ తప్పదు. ఏదో బిజినెస్ పని ఉందంటూ, తన ఇంటికి వచ్చిన అతిథి అతను. పైగా మేనమామ కొడుకు.

అలా చూసీ చూసీ.. చివరికి అతనికే విసుగొచ్చిందో ఏమో! ఉన్నట్టుండి గాఢంగా నిట్టూర్చాడు సాందీప్.

''అయినా ఏవిటి పునీతా! ఇలా చేశావ్'' నిష్టూరంగా అన్నాడు.

బిత్తరపోయిందామె.

''అసలు..నేనేం చేశాను?'' అయోమయంగా అడిగింది.

''ఏం చేశావా! మీ ఆయన్తో హాయిగా కాపురం చేసుకుంటూ నీపాటికి నువ్వు సుఖంగానే ఉన్నావ్. కానీ నన్నే ఎటూ కాకుండా చేసేశావ్'' నిందిస్తున్నట్టుగా అన్నాడు.

ఆ మాటలకి పునీత అదిరిపడింది.

''అది కూడా తప్పేనా?'' అంది.

''ముమ్మాటికీ తప్పే'' బల్లగుద్ది మరీ చెప్పాడతను.

మరోసారి తెల్లబోయిందామె.

షాక్‌ల మీద షాక్‌లు తింటూ, క్షణానికోసారి తెల్లమొహం వేస్తున్న ఆమెని చూస్తుంటే అతనికి చచ్చేంత నవ్వు రాబోయింది. అతికష్టం మీద అణచుకున్నాడు.

''నీకు రేవతి తెలుసుగా!'' మళ్ళీ అతనే అడిగాడు.

రేవతి అంటే సాందీప్ భార్య. లక్షల కట్నం గుమ్మరించి మరీ అతన్ని పెళ్ళిచేసుకుందామె. కానీ అలా పెళ్ళయిన నాలుగు నెలలకే ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఆ విషయం గుర్తొచ్చేసరికి పునీతకి మనసంతా వికలమైపోయింది.

''తెలుసు'' నిట్టూరుస్తూ చెప్పింది.

తనకెందుకు తెలీదు? పైగా ఇది స్వంత మేనమామ ఇంటి విషయం. పైగా రెండు సంవత్సరాల పాటు తను, సాందీప్‌ని ప్రేమించీ, ప్రేమించీ అతనే విటో పూర్తిగా చదివేసింది కూడా! ఒక్కముక్కలో చెప్పాలంటే అతనికి ధనదాహం. అందుకే తన ప్రేమ అతని కంటికి కనపడలేదు. క్షనుకనే రేవతిని పెళ్ళి చేసుకున్నాడు. కానీ సాందీప్ ధన దాహానికి తట్టుకోవడం, సాక్షాత్తూ లక్షాధికారి కూతురయిన ఆ రేవతి వల్ల కూడా కాలేదు. ఫలితమే ఆమె ఆత్మహత్య.

మళ్ళీ కొనసాగించాడతను. ''రేవతి చావుకి కారణం నాలోని ధనాపేక్షేనని చాలామంది ఉద్దేశం. కానీ నిజం అదికాదు'' చెప్పడం ఆపి, పునీత మొహంలోకి చూశాడతను.

''తన చావుకి కారణం నువ్వే..తెలుసా!'' మెల్లిగా అన్నాడు.

గుండె గుభిల్లుమంది పునీతకి. రేవతితో సాందీప్‌కి పెళ్ళయిందని మాత్రమే ఆమెకి తెలుసు. కానీ ఆమెని తను ఏనాడూ కలవను కూడా కలవలేదు. అలాంటి తను ఆమె చావుకి కారణం ఎలా అయిందో పునీతకి అంతుపట్టలేదు. అదే ప్రశ్నతో అతన్ని నిలదీయాలన్న ఆలోచన కూడా కంగార్లో ఆమెకి స్ఫురించలేదు. అందుకే గుడ్లప్పగించి అయోమయంగా సాందీప్‌నే చూస్తుండిపోయింది.

ఆమె ముఖంలో కదలాడుతున్న ఆశ్చర్యం, ఆందోళన, భయం చూస్తుంటే అతనికి అదే మంచి అదను అనిపించింది. అందుకే మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు. ''అసలు రేవతిని పెళ్ళి చేసుకున్నానన్న మాటేగానీ నేనేనాడూ దాంతో సుఖపడలేదు. అటు ఆమెని సుఖపెట్టలేకా ఇటు నిన్ను మర్చిపోలేకా ప్రతి రాత్రీ నేనెంత చిత్రవధని అనుభవించేవాడినో తెలుసా!'' క్షణకాలం ఆగాడతను.

ఆగిన ఆ అరక్షణంలోనే 'ఇంత చిత్రవధని అనుభవించబట్టేనా..పోయేనాటికి రేవతి మూడో నెల గర్భంతో వున్నది?' అని అడిగెయ్యాలన్నంత ఆవేశం వచ్చిందామెకి. కానీ అడగలేదు. కారణం ఒకటే. అతనింకా ఏం చెబుతాడో వినాలని. ఆ ఉద్దేశంతోనే మౌనంగా ఉండిపోయింది.

ఆమె మౌనం అతనికి మరింత బలాన్నిచ్చింది. అందుకే మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు. ''రేవతి ఓరోజు నన్ను నిలదీసి అడిగింది. నేను నా మనసులో నువ్వే ఉన్నావని నిజం చెప్పేశాను. అది విని రేవతి తట్టుకోలేకపోయింది. 'మీరు పునీతతో సుఖంగా ఉండండి. నేను మీ జీవితంలోంచి నిష్క్రమిస్తున్నాను' అంటూ ఓ ఉత్తరం రాసి పెట్టి తను ఆ రాత్రే ఆత్మహత్య చేసుకుంది. ఆ ఉత్తరం నలుగురికంటా పడితే నువ్వు అల్లరి పాలవుతావనీ, నీ కాపురం నాశనమౌతుందనీ, భయపడి నేనే దాన్ని దాచేశాను. పోన్లే. విధి విడదీసిన మన ఇద్దర్నీ మళ్ళీ ఏకం చేసింది. ఇకనుంచీ నీకు నేను. నాకు నువ్వు. సరేనా?'' ఆమె కళ్ళలోకి అదోలా చూస్తూ అన్నాడతను.

వింటున్న పునీతకి అతని మాటల్లో అంతర్లీనంగా ధ్వనిస్తున్న 'కాంక్ష'ని గమనించేసరికి అతని మీద పిచ్చికోపం వచ్చేసింది.

''నీకు పెళ్ళాంపోతే పోయి ఉండవచ్చుగాక. కానీ నాకు మాత్రం బంగారంలాంటి మొగుడున్నాడు. పండంటి బిడ్డ ఉన్నాడు. నాకంటూ ఓ పచ్చని సంసారం ఉంది. ఇవన్నీ కాదనుకుని నీకు నేను, నాకు నువ్వు ఎలా అవుతాం? అసలు నువ్వు స్పృహలో ఉండే మాట్లాడుతున్నావా?'' ఆవేశంగా అరిచేసింది.